## బాబన్నా పహాడ్ ప్రాంతంలో ఎన్ఫోర్స్‌మెంట్ టీం దాడులు

### 152 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం



నిజామాబాద్ క్రైం, బతుకమ్మ :నిజామాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాబన్నా పహాడ్ ప్రాంతంలో ఎన్ఫోర్స్ మెంట్ టీం అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 152 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే గంజాయి రవాణాకు ఉపయోగించిన ఒక బజాజ్ పల్సర్ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయి, వాహనం, సంబంధిత కేసు పత్రాలు, నిందితుడిని తదుపరి న్యాయపరమైన చర్యల నిమిత్తం నిజామాబాద్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించారు.

## తల్లిని కోల్పోయిన క్షణాల్లోనే కూతురు మృతి

### చిట్యాల గ్రామంలో విషాద ఛాయలు



కామారెడ్డి, బతుకమ్మ :కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం చిట్యాల గ్రామంలో మంగళవారం హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. ఒకే కుటుంబంలో తల్లి, కూతురు ఒకే రోజు మృతి చెందడంతో గ్రామమంతా విషాదంలో మునిగిపోయిం ది. గ్రామస్తుల కథనం ప్రకారం.. చిట్యాల గ్రామా నికి చెందిన నరసవ్వ (70) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతు న్నారు. తల్లి ఆరోగ్యం విషమంగా ఉందని తెలుసుకున్న ఆమె కుమార్తె, ధర్మారావుపేట గ్రామానికి చెందిన బాలమణి (40), వెంటనే పుట్టింటికి చేరుకున్నారు. అయితే, బాలమణి తల్లి వద్దకు చేరుకున్న కొద్దిసేపటికే నరసవ్వ తుదిశ్వాస విడిచారు. కళ్లముందే తల్లి మృతి చెందడంతో బాలమణి తీవ్ర విషాదంలో మునిగిపోయారు. తల్లి మరణాన్ని తట్టుకోలేక కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న ఆమెకు ఒక్కసారిగా గుండెపోటు వచ్చింది. దీంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు, స్థానికు లు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. బాలమణిని అత్యవసరంగా కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినప్పటికీ, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మూడు నెలల క్రితమే రోడ్డు ప్రమాదంలో కుమారుడిని కోల్పోయిన ఈ కుటుంబానికి తాజాగా తల్లి, కూతురు మరణం మరో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఒకే రోజు రెండు ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. చిట్యాల గ్రామంలో విషాద ఛాయలు అలుముకుని, ఈ ఘటన స్థానికులను తీవ్రంగా కలచివేసింది.

## ఒక వ్యక్తిని తీవ్రంగా గాయపరచిన

## ఒకరికి మూడేళ్ల జైలు శిక్ష

నిజామాబాద్ లీగల్, బతుకమ్మ :మార్కెట్ లో అలా తిరిగి వద్దాం రమ్మంటే రానందుకు చాంద్ పాషా ను కత్తితో పొడిచి తీవ్రంగా గాయపరచిన షేక్ సలీమ్ కు మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ జిల్లా సెషన్స్ జడ్జి జీవిఎన్ భారత లక్ష్మి మంగళవారం తీర్పు చెప్పారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ ధర్పల్లి రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు. చాంద్ పాషా, షేక్ సలీమ్ ఇద్దరు నవీపేట్ గ్రామ నివాసులు. 28 ఏప్రిల్, 2025 న రాత్రి సమయంలో మార్కెట్ లో అలా తిరిగి వద్దాం అని పాషా ను అడిగాడు సలీమ్. అందుకు తనకు వేరే పని ఉందనీ రాలేనని తెలిపారు. నేను రమ్మంటే రానంటావా అంటు తన వెంట తెచ్చుకున్న కత్తితో పాషా గుండె కింద పొడిచి హత్యయత్నం చేశాడని నవీపేట్ పోలీసులు కోర్టులో అభియోగ దాఖలు. నేర న్యాయ విచారణలో భాగంగా సాక్షుల సాక్ష్యాలను నమోదు చేసిన కోర్టు సాక్ష్యధారాల ప్రకారం ముద్దాయి సలీమ్ పై హత్యయత్నం నేరం రుజువు కాలేదని కాని కత్తితో పొడిచి తీవ్రంగా గాయపరచిన నేరం రుజువు అయినట్లు సెషన్స్ కోర్టు నిర్ధారించింది. భారతీయ న్యాయ సంహిత లోని సెక్షన్ 118(1) ప్రమాదకరమైన ఆయుధంతో తీవ్రంగా గాయపరచినందుకుగాను మూడు సంవత్సరాల కఠిన జైలుశిక్షతో పాటు వేయి రూపాయల జరిమానా విధించినట్లు పిపి రాజేష్వర్ రెడ్డి తెలిపారు. జరిమానా చెల్లించని యెడల అదనంగా రెండు నెలలు జైలుశిక్ష అనుభవించాలని సెషన్స్ జడ్జి భారత లక్ష్మీ తమ తీర్పులో రాశారని పిపి పేర్కొన్నారు.

# తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమకారుల అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు

### అసలైన ఉద్యమకారులకు గుర్తింపు, న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో తెలంగాణ యూనివర్సిటీ వేదికగా కీలక పాత్ర పోషించిన విద్యార్థి ఉద్యమకారులు మంగళవారం సమావేశమయ్యారు. తెలంగాణ యూనివర్సిటీ కామర్స్ బిల్డింగ్‌లోని సెమినార్ హాల్‌లో జరిగిన ఈ సమావేశానికి సుమారు 25 మంది నాటి ఉద్యమకారులు హాజరై, తమ సమస్యలు, డిమాండ్లపై చర్చించారు. ఈ సందర్భంగా డా. పిట్ల సరిత మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం యూనివర్సిటీ విద్యార్థులుగా ఎన్నో త్యాగాలు చేసి ఉద్యమంలో పాల్గొన్నామని గుర్తు చేశారు. మెస్‌లు మూసివేసినా, అనేక ఇబ్బందులు ఎదురైనా ఉద్యమ లక్ష్యం నుంచి వెనక్కి తగ్గకుండా పోరాడామని అన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని జిల్లా వ్యాప్తంగా విస్తరించడంలో యూనివర్సిటీ విద్యార్థులు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఉద్యమ సమయంలో చదువులకు ఆటంకాలు ఎదురైనా తెలంగాణ సాధనే లక్ష్యంగా తమ విలువైన సమయాన్ని కేటాయించామని తెలిపారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం నియమించిన కమిటీ కొంతమంది ఉద్యమకారుల నుంచి మాత్రమే అభిప్రాయాలు సేకరిస్తోందని, వాస్తవంగా ఉద్యమంలో పాల్గొన్న పలువురికి సరైన గుర్తింపు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నియమించిన కేకే కమిటీ నిజమైన ఉద్యమకారులను గుర్తించి వారికి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో ఉద్యమకారులు తమ హక్కుల సాధన కోసం పలు డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యమకారులకు 250 గజాల స్థలాన్ని కేటాయించాలని కోరారు. అలాగే జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాల్లో పాల్గొన్న వారికి అమలు చేసిన విధానాలను అధ్యయనం చేసి, తెలంగాణ ఉద్యమకారులకు కూడా సమాంతర రిజర్వేషన్ల ద్వారా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమంలో పాల్గొన్న వారికి ప్రస్తుతం ఉన్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, గెస్ట్, పార్ట్‌టైమ్ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, వారి సేవలను గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అదేవిధంగా ఉద్యమకారులకు ప్రత్యేక హెల్త్ కార్డులు, గుర్తింపు కార్డులు జారీ చేయాలని, ముఖ్యంగా మహిళా ఉద్యమకారులను ప్రత్యేకంగా గుర్తించి తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తెలంగాణ యూనివర్సిటీ ఉద్యమకారుల సమన్వయం కోసం అడ్‌హాక్ కమిటీని ఏర్పాటు చేశారు. యూనివర్సిటీలోని మిగతా ఉద్యమకారులను గుర్తించడం, వారందరినీ ఒక వేదికపైకి తీసుకురావడం, ప్రభుత్వం నియమించిన కేకే కమిటీతో సమన్వయం చేయడం వంటి బాధ్యతలను ఈ కమిటీ నిర్వహించనుంది. అడ్‌హాక్ కమిటీ సభ్యులుగా ఎల్‌బీ రవి కుమార్, డా. ఎన్. సౌందర్య, డా. ప్రసన్న, డా. ఎం. సిద్ధలక్ష్మి, డా. ఈ. శ్రీనివాస్ గౌడ్, డా. పుప్పాల రవి, డా. రవీందర్ నాయక్, బట్టు సురేష్, సంతోష్, బాలరాజు నాయక్, సుధాకర్, డా. రమేష్ నాయక్, డా. భరత్, పిల్లి శ్రీకాంత్, డా. పులి జైపాల్, డా. పీబీ సత్యంలను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో డా. సరిత పిట్ల, పస్కా నర్సయ్య, వాసరి సాయినాథ్, ఎండల ప్రదీప్, పిల్లి శ్రీకాంత్, డా. పులి జైపాల్, డా. శ్రీనివాస్ గౌడ్, డా. పుప్పాల రవి, డా. సౌందర్య, డా. సిద్ధలక్ష్మి, డా. ప్రసన్న, విజయలక్ష్మి, స్వరూప, బాలరాజు నాయక్, సంతోష్, డా. రమేష్ నాయక్, డా. భరత్, డా. సత్యం, డా. రవీందర్ నాయక్, బట్టు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**పిట్ల సరిత ప్రకటించిన కమిటీతో మాకు సంబంధం లేదు : ఎండల ప్రదీప్**

మంగళవారం తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమకారుల సంఘం నాయకులతో సమావేశం నిర్వహించడం జరిగిందని ఎండల ప్రదీప్ తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యమ సందర్భంగా జరిగిన సంఘటనలను నెమరేసుకొన్నారు. ప్రభుత్వం వేసిన కేకే కమిటీ కి యూనివర్సిటీ తరపున ఒక నివేదిక ఇయాలని నిర్ణయం చేయడం జరిగిందన్నారు. అందరూ రాని కారణంగా మరో సారి కూర్చొవాలని నిర్ణయం జరిగిందని, కొంత మందికి పూర్తి అవగాహనా లేక కేకే కమిటీ ని తప్పుపట్టుతున్నారన్నారు. అవకాశం వచ్చినప్పుడు, విద్యార్థి ఉద్యమకారులకు ఎలా న్యాయం చేయాలో ఆలోచించాలని, సరిత ప్రకటించిన కమిటీ తో ఈరోజు జరిగిన సమావేశానికి హాజరైన వారికి ఎలాంటి సంబంధం లేదని, పూర్తిగా సరిత వ్యక్తి గతంగా ప్రకటించారు కావున తొందర్లో తెలంగాణ ఉద్యమ కారుల సంఘం ను ప్రకటిస్తామన్నారు

# ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

### జిల్లా ఎస్పీ డి.జానకి సమీక్ష

మహబుబ్ నగర్, బతుకమ్మ :మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లి గ్రామంలోని అమర రాజా గిగా కారిడార్‌లో ఏర్పాటు చేసిన సెల్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ప్రారంభోత్సవం, ప్లాంట్ సందర్శన, సమావేశ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొననున్న నేపథ్యంలో జిల్లా పోలీసు శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి జిల్లా ఎస్పీ డి.జానకి భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. సీఎం హెలికాప్టర్ దిగనున్న హెలిప్యాడ్, ప్రారంభోత్సవ వేదిక, సమావేశ ప్రాంగణం, వీఐపీ రాకపోకల మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలను ఆమె క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ సమగ్ర బ్రీఫింగ్ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన బాధ్యతలను అప్రమత్తతతో, సమన్వయంతో నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, అమర రాజా సంస్థ ప్రారంభోత్సవం ప్రతిష్ఠాత్మక కార్యక్రమం కావడంతో భద్రతా పరంగా ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వకుండా విధులు నిర్వహించాలని





సూచించారు. వీఐపీ రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ నిర్వహణ, ప్రవేశ – నిష్క్రమణ మార్గాలు, సమావేశ ప్రాంగణం వద్ద విధులు నిర్వహించే సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేసి కార్యక్రమం ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేలా చూడాలని తెలిపారు. విధుల్లో ఉన్న ప్రతి పోలీసు అధికారి ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని ఎస్పీ సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన బందోబస్తు కోసం మొత్తం 450 మంది పోలీసు సిబ్బందిని నియమించారు. ఇందులో జిల్లా ఎస్పీ, ఒక అదనపు ఎస్పీ, నలుగురు డీఎస్పీలు, 17 మంది ఇన్‌స్పెక్టర్లు, 37 మంది ఎస్ఐలు, 86 మంది ఏఎస్ఐలు/హెడ్ కానిస్టేబుళ్లు, 286 మంది పోలీస్ కానిస్టేబుళ్లు, 18 మంది హోంగార్డులు ఉన్నారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి భద్రతా ఏర్పాట్లను పటిష్ఠంగా అమలు చేయాలని జిల్లా ఎస్పీ డి.జానకి ఆదేశించారు.


# నీటి సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

### మున్సిపల్ కమీషనర్ గోవు గంగాధర్

బాన్సువాడ, బతుకమ్మ :నీటి సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ గోవు గంగాధర్ అన్నారు. మున్సిపల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నీరు అమూల్యమైన సహజ వనరు అని, ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించాలని సూచించారు. ఇంట్లో పాఠశాలలో అవసరమైనంత మేరకే నీటిని ఉపయోగించడం లీకేజీలను వెంటనే మరమ్మతు చేయించడం వర్షపు నీటి సంరక్షణ చేపట్టడం, చెట్లు నాటడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించడం చెరువులు, కాలువలు మరియు ఇతర నీటి వనరులను పరిశుభ్రంగా ఉంచడం




వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తమ ఇళ్లలో, పాఠశాలల్లో మరియు పరిసర ప్రాంతాల్లో నీటిని వృథా కాకుండా చూసుకోవడంతో పాటు, ప్రజల్లో కూడా నీటి సంరక్షణపై అవగాహన కల్పించాలని కోరారు.




కార్యక్రమం ముగింపులో విద్యార్థులు నీటిని సంరక్షిస్తామని, ప్రతి నీటి బొట్టు విలువను గుర్తించి బాధ్యతాయుతంగా వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రదనోపాధ్యాయురాలు వాణి, ఉపాధ్యాయులు 13వ వార్డ్ కౌన్సిలర్ ఖాలేక్, కో సభ్యులు కమర్ సుల్తానా గౌస్ పాషా , పురపాలక సిబ్బంది,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.